
# మాంగల్యం తంతునానేన





ఒక అర్థరాత్రివేళ మంచి నిద్దట్లో వున్న నన్ను మాఅమ్మ గ్లాసెడు నీళ్ళు జల్లి లేపితే. ఏడ్చుకుంటూ తిట్టుకుంటూ లేచి తలన్నా దువ్వుకోకుండా, బట్టలన్నా మార్చుకోకుండా ఒక పెళ్ళికి వెళ్ళి రావడం నాకున్న చిన్నప్పటి జ్ఞాపకాలలో ఒకటి. నాకు కాస్త వూహ తెలిశాక నేను చూసిన మొదటి పెళ్ళి అదే! నేను రెండేళ్ళ పిల్లగా వున్నప్పుడు మాకు చాలా దగ్గర బంధువులూ, మంచి శ్రీమంతులూ అయినవాళ్ళింట జరగనున్న పెళ్ళి విందు నా మూలంగా ఎలా అభాసవబోయిందో మా అమ్మ తను బతికున్నన్నాళ్ళూ

అందరితో చెప్తునే వుండేది. ఆ పెళ్ళిలో వంట భోజనాల పెత్తనమంతా మా అమ్మా నాన్నా చేశారుట. వంటలవుతుండగా నేను వంటవాడిని ఒక జిలేబి ఇవ్వమని అడిగానుట. ఆ వంటవాడు "ఛో! ఛో!" అని చెయ్యి చూపిస్తూ నన్ను కేకలేసేటప్పటికి మా నాన్న కోపం పట్టలేక వాడి మీదకి కఱ్ఱతీసుకుని వెళ్ళి "నా కూతురు జిలేబి అడిగితే పొమ్మంటావా?" అని ఒక్కటేశారుట. వెంటనే వంటవాళ్ళందరూ వంట చేయడం ఆపేసి పొయ్యిల్లో నీళ్ళు పోసేసి వెళ్ళిపోయారు.

ఇంకేవుంది! పెళ్ళింట్లో ఒకటే గోల ఏదో తుఫానులో చిక్కడ్డట్టు ప్రతి ఒక్కడూ ఇంకొకడికి ఆ కథ చెప్పడమే. రాత్రి మరి వెయ్యిమంది ప్రముఖులకి పెళ్ళి విందు! ఎలా ఇప్పుడు అని అందరికీ ఒకటే ఖంగారు. చేతకాని వాళ్ళు వూరికే గాభరాపడతారు గానీ ఆ పెళ్ళిపెద్ద మేధావి, మంచి పలుకుబడికలవాడు. రాజమండ్రిలో పేరు మోసిన 'వరదరావు హొటల్' కి కబురు చేసి ఆ పూట హొటల్ మూయించి వాళ్ళచేత వండించారుట. మా అమ్మ ఆ సంగతి తల్చుకు తల్చుకు మురిసిపోయేది. ఎవరో ఒకళ్ళకి నన్ను చూపిస్తూ ఆ కథంతా చెప్పేది. తల్లి ప్రేమ కాకపోతే ఇందులో నేను చేసిన ఘనకార్యం ఏవుందనీ! జిలేబి అడగడమేగా!

నేను నాలుగోక్లాసు చదువుతున్నపుడు మేము గుంటూర్లో వుండే వాళ్ళం. చిన్నారి రెండోక్లాసు. ఇందు, బుజ్జి ఇంట్లోనే గోలగోల చేస్తూండేవారు మా నాన్న నీళ్ళ రిజర్వాయర్లు కట్టించేవారు. పంతమ్మ మామ్మగారు, సీతారామయ్య తాతగారు మా ఇల్లుగల వాళ్ళన్నమాట. కానీ మాకు నిజ్జం తాతగారూ మామ్మ లాగానే వుండేవారు. మా అమ్మ వాళ్ళని పిన్నిగారూ, బాబాయ్‌గారూ అని పిలుస్తూ మా నాన్న మీద బోల్డు చెప్పేది. ఈ రోజుల్లో రెండు మూడు తరాల వాళ్ళు ఒకే కప్పుకింద నివసిస్తున్నా ఎవరి జీవితాలు వాళ్ళవే! ఏ విషయాన్నీ ఎవరూ ఎవరితోనూ పంచుకోరు. ఈ రహస్యాలు మొయ్యలేక అందరికీ వైరాగ్యాలే! కానీ ఆ రోజులలో అలా కాదు. పక్కపక్క ఇళ్ళల్లో వుంటున్నా ఒకే లోగిట్లో వున్నట్లు అరమరికలు లేకుండా జీవించేవారు. నేను చేసే గోలో, బుజ్జిపెట్టే తిక్కలో భరించలేక అమ్మ ఎప్పుడన్నా తన ఆయుధం తీయబోయిందో ఇంతట్లోకీ పక్కింటి చారమ్మమ్మగారు (ఆవిడ పేరు పాపం చారుమతీదేవి) "ఆ! వచ్చే వచ్చే! సరోజమ్మా! అలా పిల్లల్నెవరన్నా బాదుకుంటారా?" అంటూ పరుగు పరుగున వచ్చి ఆ విసనకఱ్ఱ తీసుకెళ్ళిపోయేవారు. అమ్మకి కోపం తగ్గాక మళ్ళీ నేనే వెళ్ళి దాన్ని పట్టుకొచ్చి గోడకి తగిలించేదాన్ని వంటింట్లో! ఎవరింట్లోనూ ఏ రహస్యాలూ దాగేవి కావు. మా నాన్నకి జీతం వచ్చిందా రాలేదా. ఎందుకాలస్యం అవుతోందీ, కంపెనీ బిల్లులు రావడం లేదా

.... తో మొదలుపెట్టి పాపక్కకి పెళ్ళి ఎందుకు కుదరడం లేదూ!... వాళ్ళ పెద్దబ్బాయి పెళ్ళి ఎప్పుడు చేస్తారు ... కోవట్లింట్లో ఈ వారం భజన తొందరగా ఎందుకాపేశారు వరకూ అన్ని విషయాలూ అందరూ అరుగుల మీద కూచుని సావకాశంగా చర్చించుకునేవారు. ఆ వీధిలో వున్న కుటుంబాలలో మావే కాస్త మధ్యస్థమైన పరిస్థితులు. నలుగురు పిల్లలు, ఎప్పుడూ వచ్చీ పోయే చుట్టాలూ, ఆలస్యంగా జీతాలూ ... మా అమ్మకంతా నిప్పుల మీద నడకే. మా వీధిలో మిగిలిన వాళ్ళవందరివీ కడుపులో చల్ల కదలక్కర్లేని సంసారాలు. రెండిళ్ళవాళ్ళు వ్యాపారస్థులు. ఆ రోజుల్లోనే మంచి కార్లుండేవి. మిగతా వాళ్ళు రిటైరయ్యాక వచ్చే పెన్షనుతోటీ, మాలాగా సగం ఇల్లు అద్దెకు తీసుకుని ఇచ్చే డబ్బులతోటీ హాయిగా క్లుప్తంగా కాలక్షేపం చేసేవారు. అందులో మా తాతగారికీ, మామ్మగారికీ సగం రోజులు - ఎక్కడో అక్కడ పెళ్ళిళ్ళో, పేరంటాలో, విందులో, తద్దినాలో వుండేవి. అంతమంది బంధువులు వాళ్ళకుండేవారు.

అంత సలక్షణమైన సుసంపన్నమైన మా వీధి చివరన ఒక చిన్న శివాలయం వుండేది. ఎన్నో సంవత్సరాల క్రితం ఒక జమీందారుగారు ఆ ఆలయాన్ని కట్టించి రెండెకరాలు మాన్యంగా రాశారుట. ఆ పొలం తాలూకు ఆదాయంలో ఆ గుడి నడవాలన్నమాట. వంశపారంపర్యంగా పూజారి కుటుంబం కూడా ఆ గుడి ఆవరణలోనే చిన్న పెంకుటింట్లో వుండేవారు. కానీ ఎవరో ఆ గుడి మాన్యాలని స్వాహా చేయడంతో ఆ గుడిలో శివుడికి డబ్బులేదు. ఆయనని నమ్ముకున్న గుడి పూజారి కుటుంబానికి తిండీలేదు. పాపం ఆ శివుడే పాత ఉత్తరీయం పంచెలాగ కట్టుకుని అతి నిరాడంబరంగా వుండేవాడు. అమ్మవారు కూడా పసుపు అద్దిన ఉత్తరీయాన్నే చీరలా ధరించి పేద ముత్తయిదువులాగా పసుపుకొమ్ము కట్టిన తాడు వేసుకునేది. ఆ పూజారిగారు శివలింగానికి మాత్రం విబూది బాగా పెట్టి గన్నేరుపూలతో అలంకరించేవాడు. దేవుళ్ళల్లో కూడా డబ్బున్నవాళ్ళూ, లేనివాళ్ళూ వుంటారా అని ఆశ్చర్యంవేసేది. వారిని అలా చూడలేక నాకు గుడికి వెళ్ళడం ఇష్టంగా వుండేది కాదు. అందుకేనేమో మా వీధిలో వాళ్ళు కూడా శివరాత్రినాడు తప్ప ఆ గుడికి ఎక్కువగా వెళ్ళేవారు కాదు. వెళ్ళినా పళ్ళెంలో డబ్బులేసేవాళ్ళు కాదు. కానీ రెండువీధులవతలున్న ఆంజనేయస్వామి గుడికి మాత్రం ప్రతి శనివారమూ తప్పనిసరిగా వెళ్ళి అర్చనలు చేయించేవారు. ఆ రోజులలో ఇలాంటి దేవాలయాలని ప్రభుత్వాలు పెద్దగా పట్టించుకోవడం గానీ, పూజార్ల అజ కనుక్కోవడం గానీ ఉత్సవాలు జరపడం గానీ వుండేవికావు. అన్న దానాలుండేవి కాదు. పైగా బియ్యానికి రేషను. గుడికి వెళ్ళిన జనం వాళ్ళంతటవాళ్ళు హారతి పళ్ళెంలో డబ్బులేస్తేనే

గుడికి వైభవం. పూజారికి భోజనం.

సర్వత్రా కనపడేలాగానే ఆ పూజారి బహుకుటుంబీకుడు. ఇద్దరాడపిల్లలు, నలుగురు మగపిల్లలు, మళ్ళీ ఒక చంటిపిల్ల. మొత్తం ఏడుగురు. అధికసంతానం, పేదరికం రెండూ కలిసే వుంటాయి. దేని మీద ఏది ఆధారపడుతుందో చెప్పడం కష్టం. వారి రెండో అమ్మాయి పేరు పార్వతి. చాలా అందంగా వుండేది. నాకన్నా ఒక ఏడెనిమి దేళ్ళు పెద్దేమో. అప్పుడప్పుడు మా అమ్మ తన పాతచీరలిస్తే వాటిమీద ఎంబ్రాయిడరీ చేసి ఓణీలుగా చేసుకునేది. ఎవ్వరూ అది మా అమ్మ ఇచ్చిన చీర అని కనిపెట్టలేకపోయేవారు. నిజానికి పూజారిగారికన్నా ఆ అమ్మాయి సంపాదనే ఎక్కువగా వుండేది. ఎవరి ఇంట్లో పని పడ్డా వెళ్ళి అందుకునేది. మడికట్టుకుని పప్పురుబ్బి వడియాలు పెట్టిపెట్టేది. అప్పడాలు వత్తిపెట్టేది. చుట్టాలొస్తే వెళ్ళి వంట సాయం చేసేది. మాలాగా పిల్లలున్న ఇళ్ళల్లో కారప్పూసలూ, మిఠాయికొమ్ములు - చేసి పెట్టేది. మా ఇంటికి తరచు వచ్చి అమ్మకి సాయం చేస్తూ వుండడంతో నాక్కూడా మంచి స్నేహితురాలైంది. అమ్మకే అవసరం పడ్డా పార్వతిని పిల్చుకురావే అని నన్నే తోలేది. పార్వతంటే నాకిష్టమేగానీ వాళ్ళింటికెళ్ళడం నాకిష్టం వుండేదికాదు. ఎందుకో దిగులు దిగులుగా అనిపించేది. ఏంటో అంతా వేరుగా వుండేది. పార్వతి వాళ్ళ అక్కపేరు సరస్వతి. చాలా లావుగా అమాయకంగా మొద్దల్లే వుండేది. పూజారిగారి భార్య తన పనంతా అయ్యాక ఒక కంచంలో అన్నం కలుపుకు వచ్చి చేతిలో ముద్దలు పెడితే తినేది. వూరికే కారణం లేకుండా అందరినీ చూసి నవ్వుతూ వుండేది. కాని ఎవరినీ ఏమీ అనేది కాదు. పార్వతి తమ్ముళ్ళు విశ్వం రామభద్రం, మల్లి, బుజ్జిగాడు చిన్న చిన్న గావంచాలు కట్టుకుని తిరుగుతూ వుండేవారు. వాళ్ళు మామూలు బట్టలేసుకుని తిరగడం నేనెప్పుడూ చూడలేదు.

ఆవేళ స్కూల్లో నాకు కూరలతోటకి నీళ్ళుపెట్టే డ్యూటీ వుండడంతో ఇంటికొచ్చేటప్పటికి చాలా ఆలస్యమయింది. నేను గేటు తీసుకుని లోపలికి వచ్చేటప్పటికి వీధి వరండాలోనే అమ్మా, పూజారిగారి భార్య నెమ్మదిగా మాట్లాడుకుంటున్నారు. ఆవిడ చేతిలో నిండా బియ్యం వున్న సంచి కనపడింది. "మర్చిపోకండి అమ్మా" అంటూ ఆవిడ వెళ్ళిపోయారు. "చుట్టాలొచ్చారా వాళ్ళింటికి" అని అడిగాను అమ్మని. "నీకెందుకు వెధవ ఆరాలు? పోయి టిఫిను తిను" అని అమ్మ విసుక్కుంది. "నాన్నకేమీ చెప్పనులే అమ్మా" అని అక్కడితో ఆ విషయం మర్చిపోయాను.

రాత్రి అందరం భోజనాలు చేసాక వెళ్ళి బుజ్జి పక్కన పడుకున్నాను. బాగా

అలిసిపోయి వున్నానేమో గట్టి నిద్రపట్టేసింది. నేను నీళ్ళు పోసిన వంగ మొక్కలన్నీ పెద్దవై కాయలు కాసినట్లూ అవి గాలికి వూగుతున్నట్లూ కలకూడా వచ్చింది. నేనలా కలల్లో మునిగి తేలుతుండగా మీద వానచినుకులు పడసాగాయి. వుండుండీ వాన పడుతోంది. అంత మంచి కలలోంచి మెలకువ వచ్చి చూస్తే ఎదురుగా మా అమ్మ నీళ్ళ గ్లాసుతో ప్రత్యక్షమయింది. చిన్న చిన్నగా ఆ నీళ్ళు నామీద జల్లుతూ "లే నానీ! లేమ్మా పెళ్ళికి వెళ్ళాలి" అని నన్ను లేపడం నాకు నిన్మా మొన్నా జరిగినంత స్పష్టంగా గుర్తుంది. "ఇప్పుడే నాకు పెళ్ళేవిటమ్మా!" అని మళ్ళీ నిద్దట్లోకి జారుకోబోయా! "లేవ్వేగాడిదా! నీకప్పుడే పెళ్ళి కావాలా? ఇదిగో పట్టు!" అని ఒక్కటేసింది. "అబ్బా! నేను నిద్దర పోతున్నా కూడా ఓర్వలేక చంపేస్తావా అమ్మా!" అని ఒక్క అరుపు అరవబోయేసరికి ఒక చేత్తో నోరు నొక్కి ఇంకో చేత్తో నన్ను లాక్కుని బయటకు తీసుకెళ్ళి వీధి తలుపు గడియవేసి తాళం పెట్టింది. అమ్మ చేస్తున్న పనిని కనీసం కలలో కూడా వూహించలేని మా నాన్నా, మిగతా వాళ్ళందరూ అమాయకంగా నోళ్ళు తెరుచుకుని నిద్రపోతుండగానే వాళ్ళని తాళం పెట్టింది.

గేటు బయట చేతిలో పెద్ద తమలపాకుల మోదతో నిలబడున్న తాతగారిని మామ్మగారిని చూసేటప్పటికి నా నిద్దర ఎగిరిపోయింది. అంత చిమ్మచీకట్లో తాత గారి చేతులో వున్న టార్చిలైటు కర్ర సాయంతో ఎక్కడ కుక్కలు వెంటపడతాయోననే భయంతో నిమ్మళంగా గుడివైపు నడిచాం. "ఇంత అర్ధరాత్రివేళ మేళాలన్నా లేకుండా దొంగపెళ్ళెవరు చేసుకుంటున్నారమ్మా" అని మా అమ్మనడిగా. "పూజారిగారి పెద్దమ్మాయి పెళ్ళి. ముగ్గురమయ్యామని చెప్పి నాలుగోదానిగా నిన్ను తీసు కెళ్తున్నాం! ఎక్కువగా వాగకుండా ఒక పక్కని కూచుని పెళ్ళిచూడు. నిద్దరొస్తే నిద్రపో! వెధవ ఆరాలు తీసావంటే పడిపోతాయ్" అని తనకి చేతనయినంత మర్యాదగా అమ్మ విషయం చెప్పింది. నోరుమూసుకు చూసే పెళ్ళీ ఒక పెళ్ళేనా అని అనుకుంటూ ఏడుపు మొఖంతోటే గుళ్ళో అడుగు పెట్టాను.

ఇన్నేళ్ళు గడిచినా ఆ దృశ్యం నాకు చక్కగా గుర్తుంది. ఎప్పుడూ రాలిన రావి ఆకులతో, దుమ్మూధూళితో దిగులు దిగులుగా వుండే ఆవరణ అంతా శుభ్రంగా తుడిచి అలికాక పెట్టిన ముగ్గులతో, దివ్యంగా వెలుగుతున్న నూనె దీపాలతో లక్షణంగా వుంది. శివుడూ, అమ్మవారూ కూడా కాస్త నీళ్ళు పోసుకుని మంచి బట్టలు కట్టుకుని శుభ్రంగా కనిపించారు. పూజారిగారి భార్య గర్భగుడి గడపకి పసుపు పూసి బొట్లు పెడుతోంది. "పిన్నిగారూ! తమలపాకులు తెచ్చారా?" అంటూ మామ్మగారి చేతిలోనుండి తమలపాకులు లాక్కుని వాటికే దారం కట్టి తోరణంలా

కట్టారు. ఏం చేస్తారు పాపం వాళ్ళకి మావిడాకులు దొరకలేదుట.

మా అమ్మ దగ్గిర్నించి తీసుకెళ్ళిన బియ్యంలో పసుపు కలిపి రెండు పళ్ళాలలో పోసిందావిడ. 'పెళ్ళివారెప్పుడొస్తార'ని అడిగా! 'ఇంకా చాలా టైముంది కదమ్మా! వస్తారు' అని మళ్ళీ పనిలో పడింది. పూజారిగారు చూస్తే ఎప్పుడూలా కాకుండా బోల్డు కోపంగా కనిపించారు. ఆవిడ పనులన్నీ చేస్తూ కూడా మాటిమాటికీ కళ్ళు తుడుచుకుంటోంది. పాపం సరస్వతక్కకి అన్నం ఎవరు పెడతారా? అని ఏడుస్తోందేమోలే అని అప్పుడు నేననుకున్నాను గానీ, కారణం అదికాదని చాలా ఏళ్ళ తర్వాత గానీ నాకర్థం కాలేదు. పార్వతక్క రెండో తమ్ముడు పటికబెల్లం ముక్కలు కొట్టి ఒక కాయితంలో వేస్తూ మధ్యమధ్యలో చిన్నవలుకులు నోట్లో పడేసుకుంటున్నాడు. అది చూసిన విశ్వం గబగబ వచ్చి 'అలా తినేయకు, మళ్ళీ తక్కువ పడతాయ్' అని వాడినొక్క మొట్టికాయ వేశాడు. అందరం కాసేపు అక్కడే నిలబడి చూసి నెమ్మదిగా మెట్లెక్కి చాపపరుచుకుని కూచున్నాం. మా అలికిడికి అక్కడ ఆరుబయట మడతమంచం మీద నిద్రపోతున్న చుట్టపాయన లేచాడు. ఆవలిస్తూ చేతికున్న గడియారం చూసి "అబ్బో! టైమవుతోందే" అనుకుని "అక్కయ్యా! తలమీద చవురు పెట్టి వేడినీళ్ళు తొరుపుతావా?" అనడిగాడు. ఆయన కూడా పూజారిగారిలానే వున్నాడు. కాకపోతే కాస్త ఎర్రగా బొద్దుగా వున్నాడు. చేతి వేళ్ళకి నాలుగు వుంగరాలు, మెడలో పెద్ద బంగారం గొలుసు వున్నాయి. ఆయనని చూసి నేను పెళ్ళి చేయించడానికి వచ్చిన పూజారిగారి స్నేహితుడేమో అనుకున్నాను. కానీ ఆయన స్నానం చేసి పట్టుబట్టలు కట్టుకుని వచ్చాక, పూజారిగారి భార్య ఆయనకి పొడుగు బొట్టు పెట్టి, కాళ్ళకి పారాణి పెట్టి హారతి ఇవ్వడం చూశాక ఆయనే పెళ్ళికొడుకని అర్థమయింది. పూజారిగారు ఆయన చేతిలో కొబ్బరిబొండం పెట్టి పీటమీద కూచోపెట్టి ఏవో మంత్రాలు చదవసాగాడు.

ఇంక అక్కడుండి చేసేదేముంది, సరస్వతక్క ఎలావుందో చూద్దామని వాళ్ళ ఇంట్లోకి వెళ్ళా. సరస్వతక్క నవ్వుతూ తన చీర, చేతికున్న గాజులూ చూపించింది. తలనిండా పూలు పెట్టారని అవి కూడా చూపించింది. కానీ అలాగే ఇంచుమించు ముస్తాబైన పార్వతక్క మొఖం మాత్రం ఏడ్చేడ్చి ఇంతలావు వాచిపోయి వుంది. అక్కకి పెళ్ళి అవుతుంటే చెల్లెళ్ళింతగా ఏడుస్తారా? పోనీమంటే తోడిపెళ్ళికూతుర్ని చేసారు కదా అని సంతోషించచ్చు కదా! అనుకుని "ఏడవకక్కా! సరస్వతక్క నిన్ను చూడ్డానికి వస్తూనే వుంటుందిలే!" అని కాస్త ధైర్యం చెప్పబోయాను. "అయ్యో! పిచ్చీ, నా బంగారం" అని అంటూ నన్ను వాటేసుకుని ఇంకా ఏడ్చింది పాపం.

"ఇంక ఏడ్చింది చాలు! అమ్మవారి దగ్గర కూచుని గౌరీపూజ చేయండి" అని పూజారిగారు అరవడంతో అందరం కలిసి అమ్మవారి దగ్గర చేరాం. తోడిపెళ్ళికూతురు కూడా గౌరీ పూజ చేయాలని నాకర్థమయింది. ఆ పూజ కాసేపు చూసి మళ్ళీ వసారాలో పెళ్ళి జరగాల్సిన చోటుకి వచ్చి మామ్మగారి పక్కన కూచున్నాను. పూజారిగారు రామభద్రం చేతిలో ఇత్తడి పళ్ళెం గరిట, మల్లిగాడి చేతిలో దేవుడి గంటా పెట్టి తను చెప్పినప్పుడు గట్టిగా మోగించమని చెప్పి వాళ్ళని గుడి మెట్లమీద కూలేశారు.

పూజారిగారు గట్టిగా మంత్రాలు చదువుతూనే కన్యాదాత చేయాల్సిన పనులు చేయడం మొదలుపెట్టారు. పెళ్ళి కొడుకు పీటలకెదురుగా నాలుగు పీటలేశారు. రెండింటిమీద అక్కలిద్దర్నీ కూచోబెట్టారు. ఇద్దరి చేతుల్లోనూ కొబ్బరి బొండాలు పెట్టారు. నాకనుమానం వచ్చి తోడి పెళ్ళికూతురికి కూడా కొబ్బరికాయిస్తారా అని అడగబోయానో లేదో అమ్మ నన్ను "నోర్మూయ్" అని అరవడంతో చూస్తూ వుండిపోయాను. ఇంతలోకి సరస్వతక్క చేతిని పెళ్ళికొడుకు చేతిలో పెట్టి నీళ్ళుపోసారు. వాళ్ళ అమ్మా నాన్నా కలిసి అలాగే పార్వతక్క చేతిలో కూడా నీళ్ళు పోసారు. ఎవరినీ ఏవీ మాట్లాడనీయకుండా, పలకరిస్తే తిడుతూనో, కోప్పడుతూనో చేస్తూ అటు పెళ్ళికూతురి చెల్లీ, తల్లీ అందరూ ఏడుస్తూ పెళ్ళి చేసుకుంటుంటే చూడ్డానికి ఏం సరదా వుంటుంది? నాకు విసుగొచ్చి మామ్మగారి వడిలో తలపెట్టుకుని నిద్రపోయాను.

నాకు మెలకువ వచ్చి చూసేటప్పటికి మా అమ్మదగ్గిర్నించి తీసుకున్న బియ్యం అన్నీ పసుపుతో కలిపి పీటల మీద పడున్నాయి. అక్కలిద్దరూ పచ్చగా మారిపోయిన తెల్లచీరలతో – తలనిండా బియ్యంతో చాలా బాగున్నారు. మెడలో ఇంతలావు పసుపుతాళ్ళు చిన్న చిన్న మంగళసూత్రాలూ, పొట్టిగా నల్లపూసలూ వడిలో పెద్ద కందపిలక బియ్యం మూటతో ప్రయాణానికి సిద్ధంగా వున్నారు. మేమందరం చూస్తూండగానే, వాళ్ళ అమ్మా, నాన్నా తమ్ముళ్ళు ఏడుస్తుండగానే రెండు చిన్న సంచులతో అక్కలిద్దరూ ఒక రిక్షాలోనూ, చుట్టం పెళ్ళికొడుకు ఇంకో రిక్షాలోనూ ఎక్కి వెళ్ళిపోయారు. మేం కూడా బయలుదేరుతుంటే రాంభద్రం మా అందరి చేతుల్లోనూ పటికబెల్లం ముక్కలు పెట్టాడు. అవి నోట్లో వేసుకుని ఇంటికొచ్చి మళ్ళీ నిద్రపోయాను.

నా ఈ ఇన్నేళ్ళ జీవితంలో మళ్ళీ ఎప్పుడూ ఇటువంటి పెళ్ళిని చూడలేదు. పేదరికం ఎంత దారుణమయినదో చెప్పాలంటే ఈ పెళ్ళే ఉదాహరణ. అమ్మ, ఆ

తరువాత నేను పెద్దయ్యాక అడిగినపుడు చెప్పిన వివరాలవల్ల ఆ సంఘటన పూర్తిగా అర్థమయింది. ఆపెళ్ళికొడుకు పూజారిగారి భార్యకి తమ్ముడి వరస. కాస్త పొలం పుత్రాగలవాడు. కంచిలో వరదరాజస్వామి గుడిలో పూజారి. ఆయన భార్య మూడవ కాన్పులో మరణించింది. తల్లిలేని పిల్లల్ని సాకడం ఒక సమస్య అయితే భార్యాహీనుడైన ఆయనని యజ్ఞయాగాదులలో పాల్గొననిచ్చేవారు కాదట. అందువల్ల పెళ్ళి చేసుకోవడం తప్పనిసరి అయింది. వీళ్ళకి ఆడపిల్ల పెళ్ళికి ఉందని తెలిసి అడగడానికి వచ్చాడు. వీళ్ళు సరస్వతిని చూపిస్తే అతను వద్దని అటూ ఇటూ తిరుగుతున్న పార్వతినిస్తే చేసుకుంటానన్నాడట. సరస్వతిని కూడా చేసుకుంటే పార్వతినిస్తామని ఆశపెట్టారట వీళ్ళు. చూశారా వ్యవహారాలెలా సాగుతాయో! ఆ పెళ్ళి వివరాలు నాన్నకి చెప్తూ అమ్మ పెట్టుకున్న కన్నీళ్ళు కూడా నేనెప్పటికీ మర్చిపోలేను. ఆ తరువాత ఎక్కడన్నా పార్వతక్క పక్కన ఇద్దరు పిల్లలతో వంటినిండా నగలతో నవ్వుతూ కనిపిస్తుందేమోనని వెతుకుతూ వుండేదాన్ని! తప్పకుండా తను సంతోషంగా వుండేవుంటుంది.

✤